

రైతన్న వర్రీ

వర్షాభావంతో వరినాట్లు అంతంతమాత్రమే

వరి ఆకులు ముదిరిపోవడంతో రైతుల ఆవేదన

- బుచ్చెయ్యపేట మండలంలో 2,200 హెక్టార్లకు 1,300, సబ్బవరం మండలంలో 1,318 హెక్టార్లకు 280లో మాత్రమే వరినాట్లు వేసిన వైనం
- కొందరు బావులు, గెడ్డల నుంచి మోటార్ల ద్వారా నీరు తోడుకుని దమ్ము చేస్తున్న పరిస్థితి

బుచ్చెయ్యపేట/సబ్బవరం, ఆగస్టు 25:

వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి లభ్యత లేని పొలాల్లో వరినాట్లు వేయలేదు. వరి ఆకుల పోతలు వేసి రెండు నెలలు గడుస్తుండడంతో ముదిరిన ఆకులను రక్షించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. జూలై రెండవ వారం వరకు మురిపించిన వర్షాలు ఐదు వారాలుగా ముఖం చాటేయడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. బుచ్చెయ్యపేట మండలంలో సాధారణ వరిసాగు విస్తీర్ణం 2,200 హెక్టార్లు కాగా, కేవలం 1300 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు వేశారు. అలాగే సబ్బవరం మండలంలో సాధారణ వరిసాగు విస్తీర్ణం 1,318 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 280 హెక్టార్లు మాత్రమే వరినాట్లు పడ్డాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

బుచ్చెయ్యపేట మండలంలో ఎర్రవాయి ప్రాంతమైన మల్లాం, ఆర్.శివరామపురం, ఎం.భూపతిపాలెం, రాజాం, నీలకంఠాపురం, త్రైపురం, చిట్టియ్యపాలెం, తురకలపూడి, సీతయ్యపేట, గున్నెంపూడి, పెదపూడి, పీపీ అగ్రహారం, కొండెంపూడి, పి.భీమవరం, దిబ్బిడి, కొండపాలెం, కేపీ అగ్రహారం తదితర గ్రామాలకు చెందిన రైతులు వర్షాధారంగా పంటలు సాగు చేస్తుంటారు. అయితే వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో మండలంలో 110 చెరువుల్లో నీరు చేరక వెలవెలబోతున్నాయి. పెద్దేరు రిజర్వాయర్ నీరు అందకపోవడంతో ఎర్రవాయి ప్రాంతంలో ఏటా పంటలు నష్టపోవడం పరిపాటిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దేరు రిజర్వాయర్ నీరు పుష్కరకాలంగా సాగుకు అందడం లేదు. దీంతో గున్నెంపూడి, కొండెంపూడి, బుచ్చెయ్యపేట, కొండపాలెం, పెదమదీన తదితర పది గ్రామాలకు చెందిన రైతులు వర్షాభావానికి పంటలు నష్టపోతున్నారు. జూలై రెండవ వారం వరకు కురిసిన వర్షాలకు చెరువులో చేరిన కాస్త నీరు ఎండల తీవ్రతకు ఆవిరైపోతున్నాయి. మెట్ట ప్రాంతంలో వ్యవసాయ బావులు, బోర్లు కింద ఉన్న పొలాల రైతులు ఎన్నో ఇబ్బందులు పడి వరినాట్లు వేస్తున్నారు. అయితే చెరువులో నీరు లేకపోవడంతో మెట్ట ప్రాంతంలో 65 శాతం వరినాట్లు పడని పరిస్థితి ఉంది. వర్షాలు లేక దెబ్బ తింటున్న ఆకుమడులను రైతులు అధిక వ్యయ, ప్రయాసలకోర్చి రక్షించుకునేందుకు పాట్లు పడుతున్నారు. మెట్ట ప్రాంతంలో వరినాట్లుకు నోచుకోకపోవడంతో భూములు వెలవెలబోతున్నాయి. మండలంలో సాధారణ వరిసాగు విస్తీర్ణం 2,200 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు జలాశయ నీటి వనరుల లభ్యత కలిగిన వడ్డాది, విజయరామరాజుపేట, మంగళాపురం, లోపూడి, కోమళ్లపూడి, పొట్టిదొరపాలెం, కోమళ్లపూడి తదితర గ్రామాల్లో 1300 హెక్టార్లులో మాత్రమే వరినాట్లు జరిగాయి. వరి ఆకుపోతలు పోసి రెండు నెలలు గడుస్తుండడంతో నారు ముదిరిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సబ్బవరం పాతరోడ్డు వద్ద డీజిల్ ఇంజన్ సహాయంతో పొలాలకు నీరు తోడుతున్న దృశ్యం

మోటార్లతో నీరు తోడుకోవాల్సిన దుస్థితి

సబ్బవరం మండలంలో చెరువులు ఎండిపోవడంతో బావులు, గెడ్డల నుంచి డీజిల్ మోటార్లతో నీరు తోడుతూ రైతులు నాట్లు వేసేందుకు దమ్ము చేస్తున్నారు. వాస్తవానికి వర్షపాతం సాధారణం కంటే అధికంగా నమోదైందని అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో చుక్కనీరు కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దమ్ములు పట్టుకునేందుకు గడువు ముగిసిపోతోందని, వరినారు ముదిరిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది రైతులు వరుణుడిపై భారం వేసి ఖర్చులు భరిస్తూ బావులు, గెడ్డల నుంచి మోటార్లు, డీజిల్ ఇంజన్లతో నీరు తోడుతూ నాట్లు వేసేందుకు దమ్ము చేస్తున్నారు. మండలంలో ఎక్కువ ఆయకట్టు కలిగిన చెరువులైన అయ్యన్నపాలెం భూదేవి చెరువు, మలునాయుడుపాలెం మావుళ్ల చెరువు, నారపాడు తమురు చెరువు, ఆదిరెడ్డిపాలెం పోతురాజు చెరువు, సబ్బవరం దేవుడు చెరువు, గొల్లలపాలెం రాయపురాజ్ చెరువు, అమృతపురం రాజ్ చెరువులు నీరు లేక వెలవెలబోతున్నాయి. కాగా సబ్బవరం మండలంలో సాధారణ వరిసాగు విస్తీర్ణం 1,318 హెక్టార్లు కాగా, ఇప్పటి వరకు 280 హెక్టార్లలో మాత్రమే నాట్లు వేసినట్టు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఖరీఫ్ వరినాట్లు వేసుకునేందుకు సెప్టెంబరు 15వ తేదీ వరకు సమయం ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ తెలిపారు.



బుచ్చెయ్యపేట మండలం గొన్నవానిపాలెంలో వరినాట్లుకు నోచుకోని పంట పొలాలు

28న విశాఖకు మంత్రి లోకేశ్ రాక

29న కోర్టుకు హాజరు, ముఖ్యనేతలతో భేటీ



- 30న పాఠశాలల తనిఖీ, అధికారులతో సమీక్షలు
- పార్టీ కార్యాలయంలోనే బస చేయనున్న యువనేత
- 31న ఉదయం తిరిగి విజయవాడకు పయనం



నారా లోకేశ్‌కు స్వాగత ఏర్పాట్లపై చర్చిస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

విశాఖపట్నం, 25 (ఆంధ్రజ్యోతి):

ఐటీ, మానవ వనరుల శాఖా మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నాలుగు రోజుల పర్యటన కోసం ఈ నెల 28వ తేదీన విశాఖకు రానున్నారు. విజయవాడలో ఆ రోజు సాయంత్రం బయలుదేరి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన నేరుగా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి వచ్చి, పార్టీ ముఖ్యనేతలతో భేటీ అవుతారు. ఆ తరువాత అక్కడే బస్సులో బస చేస్తారు. ఈ నెల 29వ తేదీ ఉదయం సీతంపేట రాజేంద్రనగర్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి అల్పాహారం తీసుకుంటారు. అక్కడి నుంచి జిల్లా కోర్టుకు వెళ్లి సాక్షి పత్రికపై దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో వాయిదాకు హాజరవుతారు. మధ్యాహ్నం పార్టీ కార్యాలయానికి చేరుకుని ముఖ్యనేతలు, పార్టీ కేడర్‌ను కలుసుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. ఈ నెల 30వ తేదీ ఉదయం పాఠశాలల పనితీరుపై విద్యాశాఖాధికారులతో సమీక్షించిన అనంతరం నగరంలోని ఒకట్రెండు పాఠశాలలను తనిఖీ చేస్తారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తారు. తరువాత పార్టీ కార్యాలయానికి చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారు. ఈ నెల 31వ తేదీ ఉదయం తిరిగి విజయవాడ బయలుదేరి వెళతారు.

ఘన స్వాగతానికి ఏర్పాట్లు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా మంత్రి లోకేశ్ విశాఖ వస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు, నేతలు ఆళ్ల శ్రీనివాసరావు, రాజశేఖర్, వి.భరత్, బుగత సత్యనారాయణ సమావేశమై సన్నాహాలపై చర్చించారు. ఈ నెల 28న పార్టీ శ్రేణులు భారీగా ఎయిర్‌పోర్టుకు చేరుకుని లోకేశ్‌కు ఘన స్వాగతం పలకాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల నుంచి జనాన్ని సమీకరించాలని ఆదేశించారు.

నూకాంబికకు విశేష అలంకరణ

ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం నూకాంబిక అమ్మవారిని ఆదివారం విశేషంగా అలంకరించారు. శ్రావణమాసం పర్వదినం సందర్భంగా బాలాలయంలోని అమ్మవారిని తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- అనకాపల్లి టౌన్



తులసీ దళాలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

ఆర్మీ కల.. నెరవేరనున్న వేళ!

- పోర్టు స్టేడియంలో నేటి నుంచి ఆర్మీ ర్యాలీ
- వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహణ

ఇండియన్ ఆర్మీలో చేరాలన్న వేలాది మంది కలను సాకారం చేసుకునే సమయం ఆసన్నమైంది. విశాఖలోని పోర్టు స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం తెల్లవారుజామున ప్రారంభమైంది.

- వార్త 7వ పేజీలో..



అభ్యర్థుల కాల్ లెటర్లను పరిశీలిస్తున్న ఆర్మీ సిబ్బంది

వేధిస్తున్న ఇసుక కొరత

- కాంక్రీట్ మెటల్ కూడా.. మందగించిన భవన నిర్మాణ పనులు
- కొందరు సిండికేట్‌గా ఏర్పడి అధిక ధరకు విక్రయాలు
- పనులు లేక రోడ్డున పడ్డ కార్మికులు



రాజమహేంద్రవరం ఇసుకను బలిఘట్టంలో ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

నర్సీపట్నం, ఆగస్టు 25:

నర్సీపట్నంలో ఇసుక, కాంక్రీట్ మెటల్ కొరత కారణంగా భవన నిర్మాణ పనులు మందగించాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేక రోడ్డున పడే పరిస్థితి వచ్చింది. అయితే ఇసుక, మెటల్ సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

చోడవరం నియోజకవర్గం రోలుగుంటలో 15 క్వారీలు, 10 క్రషర్లు ఉన్నాయి. క్వారీల్లో తవ్విన రాయిని క్రషర్‌లో ఆడి మెటల్‌గా మార్చేవారు. ఇక్కడ నుంచి నర్సీపట్నంతో పాటు వివిధ మండలాలకు సరఫరా జరిగేది. అయితే రెండు నెలలుగా క్వారీలు, క్రషర్లలో పనులు నిలిచిపోయాయి.



రోలుగుంట క్రషర్‌లో 20 ఎంఎం మెటల్ నిల్వలు

ఎవరు ఆపారో?, ఎందుకు ఆపారో? ఎవరు నోరు మెదపడం లేదు. రోలుగుంటలోని క్వారీలు, క్రషర్లు ఎందుకు ఆపారని మైనింగ్ ఏడీని వివరణ కోరితే తాము ఆపమని చెప్పలేదని, వారే ఆపేసుకున్నారని తెలిపారు. కాగా క్రషర్లలో పని చేసే వందలాది మంది కార్మికులు, ట్రాక్టర్ యజమానులు పని లేక రోడ్డున పడ్డారు. భవన నిర్మాణాలకు, వివిధ అభివృద్ధి పనులకు కాంక్రీట్ మెటల్‌ను కోట నందూరు, రౌతులపూడి, గొట్టువాడ తదితర ప్రాంతాల నుంచి తెప్పించుకోవలసి వస్తోంది. గతంలో 20 ఎంఎం మెటల్ ట్రాక్టర్ ధర రూ.3.300 ఉంటే, కొరత కారణంగా రూ.4,300లకు విక్రయిస్తున్నారు. గతంలో 20 ఎంఎం మెటల్ లారీతో సరఫరా చేస్తే రూ.18,000లు తీసుకునేవారు. ఇప్పుడు రూ.24,000 తీసుకుంటున్నారు. 40 ఎంఎం మెటల్ ట్రాక్టర్ రూ.2,500 నుంచి రూ.3,500లకు పెంచారు.

ఇసుకదీ అడ్డదారే..

గబ్బాడ ఇసుక డిపో వివాదం తేలకపోవడంతో అక్కడ నిల్వలు ఉన్నప్పటికి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కొంత మంది ... మిగతా 8వ పేజీలో

వరహానదిలో రైతు కూలీ గల్లంతు

- గాలింపు చర్యలు ముమ్మరం



నదిలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు (ఇన్‌సెట్‌లో) బంగారయ్య (ఫైల్)

కోటవురట్ల, ఆగస్టు 25: మండలంలోని పందూరు వద్ద వరహానదిలో ఆదివారం ఓ రైతు కూలీ గల్లంతయ్యాడు. దీనికి సంబంధించి కోటవురట్ల ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోటవురట్ల మండలం కొత్త గ్రామానికి చెందిన సుంకర బంగారయ్య అలియాస్ పోతురాజు(55) ఆదివారం ఉదయం స్వగ్రామం నుంచి పందూరులో సరుగుడు తోటలు నరకడానికి కూలీ పనికి సైకిల్‌పై బయలుదేరాడు. రామచంద్రపురం జంక్షన్ నుంచి పందూరు వరహానది వంతెన వద్దకు వచ్చాడు. అక్కడ నుంచి సైకిల్‌ను భుజంపై మోసుకుంటూ నది దాటే ప్రయత్నం చేయగా నది ప్రవాహానికి కొట్టుకుపోయాడు. అతను నది దాటుతుండగా ఇద్దరు వ్యక్తులు చూసి కేకలు వేశారు. అతను గల్లంతైన విషయాన్ని రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గల్లంతైనా వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం, గజ ఈతగాళ్లు వరహానదిలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా అతని ఆచూకీ తెలియలేదు. ఎస్.రాయవరం సీఐ అప్పన్న, నక్కపల్లి సీఐ స్వామినాయుడు, స్థానిక ఎస్‌ఐ రమణయ్య గాలింపు చర్యలను పర్యవేక్షించారు. గల్లంతైనా బంగారయ్య భార్య సూర్యకాంతం ఫిర్యాదు మేరకు కోటవురట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

కాలువల నిర్మాణం కోసం పంచాయతీ చర్యలు

- అధికారులతో ఓ ఆక్రమణదారు వాగ్వాదం
- కూల్చివేతను అడ్డుకునేందుకు ఇంట్లో నుంచి బయటకు రాకుండా మొరాయింపు



ఆక్రమణల తొలగింపు సందర్భంగా గుమిగూడిన జనం

చోడవరం, ఆగస్టు 25: పట్టణంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పంచాయతీ స్థలంలో కాలువల నిర్మాణం కోసం ఆదివారం పంచాయతీ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. స్థానిక జంట థియేటర్లకు సమీపంలో ప్రధాన రహదారిని ఆనుకుని పందూరి వెంకటరమణ ఇంటి వరకు గల పంచాయతీ స్థలం ఆక్రమణలో ఉంది. ఈ పరిధిలోనే నాగలక్ష్మి అనే మహిళ ఇల్లుతో పాటు మరో వ్యక్తికి చెందిన టైర్ల దుకాణం, మరికొంతమంది ఆక్రమణలు కూడా ఉన్నాయి. పంచాయతీకి చెందిన ఈ స్థలం మీదుగా కాలువ నిర్మాణం కోసం పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. కాలువల నిర్మాణం చేపట్టడానికి అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించాలని ఆక్రమణదారులకు పంచాయతీ అధికారులు రెండు నెలల క్రితమే నోటీసులు జారీ చేశారు. అయితే పంచాయతీ అధికారుల నోటీసులను సవాల్ చేస్తూ పంచాయతీ స్థలంలో నివాసం ఉంటున్న నాగలక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనల మేరకు వ్యవహరించాలని కోర్టు తీర్పు ఇవ్వడంతో వారం రోజుల క్రితం పంచాయతీ అధికారులు మరోసారి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. వీటికి ఆక్రమణదారులు సమాధానం ఇవ్వకపోవడంతో పంచాయతీ అధికారులు ఆదివారం మధ్యాహ్నం పోలీసుల సహకారంతో ఆక్రమణల తొలగించేందుకు సిద్ధమయ్యారు. తొలుత మాజీ ఉపసర్పంచ్ సాగర్‌కు చెందిన రేకులను తొలగించారు. ఆ తరువాత టైర్ల దుకాణం కూడా తొలగించి నాగలక్ష్మి ఇంటి ముందు భాగం తొలగించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆ ఇంట్లో కొందరు మహిళలు, చిన్నపిల్లలు ఉండడంతో వారిని బయటకు రావాలని పంచాయతీ అధికారులు, పోలీసులు చాలా సేపు నచ్చజెప్పారు. వారు బయటకు రాకుండా అధికారులతో వాదనకు దిగారు. ఎంత సేపటికి వారు బయటకు రాకపోవడంతో చేసేది లేక అధికారులు వెనుదిరిగారు. కాగా కొందరు యువకులు నాగలక్ష్మి ఇంటిపైకి ఎక్కి పెంకులు తొలగించేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీనితో పోలీసులు ఆ యువకులను కిందకు దింపివేశారు. దీనిపై పంచాయతీ ఈవో నారాయణరావు మాట్లాడుతూ ఆక్రమణదారులకు ... మిగతా 8వ పేజీలో



ఇంట్లో నుంచి బయటకు రాబోమని అధికారులతో వాగ్వాదం చేస్తున్న దృశ్యం

క్రైం... crime news

ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీ

» యువకుడి దుర్మరణం.. ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

పద్మనాభం, ఆగస్టు 25: మండలంలోని చిన్నాపురం వద్ద శనివారం రాత్రిఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం చెందగా, ఇద్దరు గాయపడ్డారు. పోలీసులందించిన వివరాలివి. ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన కనకల శ్రీనివాసరావు (36) విజయనగరంలో కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని శనివారం రాత్రి 9.45గంటల సమయంలో బైక్‌పై స్వగ్రామం వస్తున్నారు. అదే సమయంలో అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఆర్‌వీ అగ్రహారం గ్రామానికి చెందిన లెక్కల సతీశ్, శ్రీదేవిక విజయనగరం వెళ్తున్నారు. సతీశ్ చిన్నాపురం జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్ల వద్ద వేగాన్ని అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న శ్రీనివాసరావు బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో రెండు బైక్‌లపైన ఉన్న ముగ్గురు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌లు నుజ్జయ్యాయి. అదే సమయంలో గస్తీలో ఉన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని 108 వాహనంలో క్షతగాత్రులను విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించగా సతీశ్, శ్రీదేవికకు చికిత్స అందించారు. వీరిలో సతీశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు మెరుగైన వైద్యం కోసం తరలించారు. దీనిపై సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ సురేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.



శ్రీనివాసరావు (ఫైల్)

28న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 28న నిర్వహించాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి నిర్ణయించారు. స్టాండింగ్ కమిటీకి ఈనెల ఏడున ఎన్నిక నిర్వహించగా, పది స్థానాలనూ కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడంతో ఇప్పటివరకు సమావేశం నిర్వహించలేదు. నూతన సభ్యులతో తొలి సమావేశం కావడంతో కమిషనర్ హాజరుకానున్నారు. ఇందుకోసం 300కిపైగా అంశాలతో ఎజెండా సిద్ధం చేశారు. వీటిలో 130కిపైగా అంశాలు మెకానికల్ విభాగానికి సంబంధించినవేనని తెలిసింది.

నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా కల్పశ్రీ

నర్సీపట్నం, ఆగస్టు 25 : నర్సీపట్నం సబ్ కలెక్టర్‌గా కేఆర్ కల్పశ్రీని నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఆర్డీవోగా పని చేస్తున్న హెచ్‌వీ జయరాం స్థానంలో 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కల్పశ్రీ బాధ్యలు స్వీకరించనున్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 25: జాతీయ సీనియర్ పురుషుల మహిళల ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ టోర్నీలో ఆంధ్ర లిఫ్టర్లు ఓ వరాల్ చాంప్ తృతీయ స్థానంలో ట్రోఫీని దక్కించుకున్నారు. కోల్‌కతాలో జరిగిన ఈ టోర్నీ పురుషుల డెడ్ లిఫ్ట్ ఈవెంట్ 59 కిలోల విభాగంలో డి. మురళీకృష్ణ (262.5 కిలోలు),66 కిలోల విభాగంలో ఎస్.శరత్ (286 కిలోలు) ఎత్తి సరికొత్త జాతీయ రికార్డులు నెలకొల్పారు. ఇక ఓవరాల్ ఈ వెంట్‌లో డి.మురళీకృష్ణ కాంస్య పతకం, 120 ప్లస్ కిలోల కేటగిరిలో షేక్ షాకిబ్ బాషా రజతం, మహిళల 76 ప్లస్ కిలోల విభాగంలో బి.చంద్రిక కాంస్యం సాధించారు. పతకాలు సాధించిన లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు గంట్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్య దర్శి ఎస్.సూర్యనారాయణ, సౌత్‌జోన్ కార్యనిర్వాహక కార్యదర్శి, ఆంధ్ర చీఫ్ కోచ్ సకల కోటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు మద్ది ప్రభాకర్ తదితరులు అభినందించారు.

ఆర్మీ కల.. నెరవేరనున్న వేళ!

» పోర్టు స్టేడియంలో నేటి నుంచి ఆర్మీ ర్యాలీ
» వచ్చే నెల 5వ తేదీ వరకు నిర్వహణ
» రోజుకు 500 నుంచి 800 మందికి పరీక్ష
» అభ్యర్థులకు ఇప్పటికే అడ్మిట్ కార్డులు జారీ
» ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు



ఆదివారం రాత్రి పోర్టు స్టేడియం బయట నిద్రిస్తున్న అభ్యర్థులు

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):
ఇండియన్ ఆర్మీలో చేరాలన్న వేలాది మంది కలను సాకా రం చేసుకునే సమయం ఆసన్నమైంది. నగర పరిధిలోని పోర్టు స్టేడియంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ సోమవారం తెల్లవారుజామున ప్రారంభమయింది. ఈ నెల 26 అర్ధరాత్రి 12.30 గంటల నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకు జరగ నున్న ర్యాలీలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి కృష్ణా జిల్లా వరకు చెందిన అభ్యర్థులు పాల్గొననున్నారు. ప్రతిరోజూ 500 నుంచి 800 మంది ర్యాలీలో పాల్గొంటారని అధికారులు అం చనా వేసి, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తిచేశారు. అభ్యర్థులకు ఇప్పటికే అడ్మిట్ కార్డులను జారీచేశారు. తమకు కేటాయించిన సమయానికి మైదానానికి చేరుకుని రిపోర్టు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఒక్క నిమిషం ఆల స్యమైనా లోపలకి అనుమతించరన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్‌మన్ పోస్టులను భర్తీ చేసేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మి ట్ కార్డు, ఒరిజినల్ ఆధార్, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువ పత్రం, పదో తరగతి మార్కులు లిస్టు, లేదా స్టడీ సర్టిఫికెట్, లేదా టీసీ గానీ తీసుకు రావాల్సి ఉంటుంది. 1600 మీటర్లు రన్నింగ్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫి కేషన్, అనంతరం మెడికల్ టెస్ట్‌లు ఉంటాయి. ఇదిలా ఉండగా ర్యాలీ జరగనున్న డైమండ్ జూబ్లీ మైదానంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ట్రాక్ పునరుద్ధరణ, బారికేడింగ్, లైట్లు, టెంట్లు, క్యూలైన్లను నిర్మించారు. ఈ మేరకు సైన్ బోర్డులను మైదానం అంతటా ఏర్పాటు చేశారు. ర్యాలీని విజయవంతంగా పూర్తిచేసేందుకు జీవీఎంసీ, రెవెన్యూ, పోలీస్, ఈపీడీసీఎల్, స్పోర్ట్స్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సహకరిస్తున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

పాకలో పాఠశాల

శీతకండిలో దారుణ పరిస్థితి

» గ్రామస్థుల చొరవతో ప్రైవేటు స్థలంలో నిర్వహణ
» నాలుగేళ్లుగా పునాది దశ దాటని భవన నిర్మాణం



సీతకండిలో ప్రైవేటు తాటాకు పాకలో నిర్వహిస్తున్న పాఠశాల

గొలుగొండ, ఆగస్టు 25: మండలంలోని శీతకండి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పదేళ్లుగా పరాయి పంచన నిర్వహిస్తున్నారు. దీనిపై స్థానిక విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గొలుగొండ మండలంలోని ఏటిగైరంపేట గ్రామపంచాయతీలోని సీతకండి గ్రామంలో ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకూ 21 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం శిథిల స్థితికి చేరడంతో ఉన్న ప్రైవేటు భవనంలో పాఠశాల నిర్వహణకు గ్రామస్థులు, విద్యాశాఖ సిబ్బంది చర్యలు తీసుకొంది. అయితే భవనం ఖాళీ చేయాలని యజమాని విద్యాశాఖను కోరారు. దీంతో పాఠశాల తరగతుల భవనం నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామంలో ఒక కుటుంబానికి చెందిన ఇంటి పైకప్పు శాబ్ వేయని ఒక ఇంటిపై తాటాకులు ఏర్పాటు చేసుకుని తరగతులు నిర్వహించాలని గ్రామస్థులు నిర్ణయించారు. ఆ తాటాకుపాకలో కనీసం వెలుతురు, గాలి పరిస్థితి ఉంది. అంతేకాకుండా పాకలో తరగతులు నిర్వహిస్తుండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పాక కావడంతో విష పురుగుల నుంచి ప్రమాదం ఏర్పడవచ్చని అంటున్నారు.



తరగతులు నిర్వహిస్తున్న గాలి, వెలుతురు లేని ఇరుకుగది

2021-22లో నాడు-నేడు పనుల్లో రెండవ విడతలో రెండు గదుల భవనం నిర్మాణానికి అప్పటి వైసీపీ ప్రభుత్వం రూ. 25 లక్షలు మంజూరు చేసింది. అనంతరం తొలుతగా ఇక్కడ శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం తొలగించారు. భవన నిర్మాణం 2021లో ప్రారంభించారు. కొంత వరకు పనులు పూర్తి కాగా, రూ.ఐదు లక్షల బిల్లులు మంజూరు చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి పాఠశాల తరగతి భవన నిర్మాణం నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతూ పునాది స్థాయిలోనే ఉండిపోయింది. అప్పటి నుంచి పరాయి పంచనే చదువులు సాగుతున్నాయి. కనీసం కూటమి ప్రభుత్వ హయాంలోలైనా పాఠశాల తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.



నాలుగేళ్లుగా పునాది దశలోనే ఉన్న పాఠశాల భవన నిర్మాణం

యాజమాన్య నిర్లక్ష్యం వల్లే 'ఎసెన్షియా'లో ప్రమాదం

» వెంటనే అరెస్టు చేయాలి
» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు



మూలజంపలో మాట్లాడుతున్న నర్సింగరావు

రాంబిల్లి, ఆగస్టు 25: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని మూలజంప గ్రామానికిచెందిన వేగి సన్యాసినాయుడు కుటుంబాన్ని ఆదివారం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. సెజ్ ఏర్పడిన తరువాత ఇదే పెద్ద ప్రమాదమన్నారు. ఈ ఘటనలో 17 మంది మృతి చెందారని, సుమారు 24 మంది వరకు గాయాలకు గురయ్యారన్నారు. ఇంత ఘోరానికి కంపెనీ యాజమన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. సేఫ్టీ ఆడిట్ నిర్వహించకపోవడం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, కార్మిక శాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం కార్మిక శాఖ అధికారులతో పాటు, భద్రతా ప్రమాణాలు పాటించని కంపెనీల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎసెన్షియా కంపెనీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు నాయుడు, ఆర్. రాము, ఎస్ఈజెడ్ నిర్వాసితుల సంఘం నాయకులు బుద్దా రంగారావు, ఆర్. రాంబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదాలపై సమగ్ర విచారణ జరపాలి

అచ్యుతాపురం రూరల్ : ఇక్కడి సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కర్మాగారంలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి, సదరు యాజమన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. ఆదివారం అచ్యుతాపురంలోని ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎసెన్షియలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారన్నారు. అలాగే, పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఇలా ఫార్మా కంపెనీల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నా యాజమాన్యాలు స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సేఫ్టీకి ప్రాధాన్యం ఇవ్వకుండా లాభాల కోసం చూస్తుండడం వల్లే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఇటువంటి కర్మాగారాలపై కేంద్ర, రాష్ట్ర ప్రత్యేక దృష్టిసారించాలని ఆయన కోరారు. యూనియన్ నాయకులు జి.కోటేశ్వరరావు, రొంగలి రాము, జి.దేముడునాయుడు, కూండ్రపు సోమునాయుడు, కర్రి అప్పారావు, బుద్దా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేశాకే కారిడార్ పనులు చేపట్టాలి

» నిర్వాసిత రైతుల సమావేశంలో పలు పార్టీల నాయకుల డిమాండ్



నిర్వాసిత రైతులకు సంఘీభావం తెలుపుతున్న పార్టీల నాయకులు

నక్కపల్లి, ఆగస్టు 25: విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం నక్కపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో రైతుల నుంచి సేకరించిన భూములకు సంబంధించి పూర్తి స్థాయిలో పరిహారం, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చిన తరువాత ఏ పనులైనా చేపట్టాలని పలు పార్టీల నాయకులు స్పష్టం చేశారు. లేనిపక్షంలో నిర్వాసితులతో కలిసి ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆదివారం మూలపర్ర గ్రామంలో మండలంలోని కారిడార్ నిర్వాసిత రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, అమలాపురం ఉప సర్పంచ్ గంటా నర్సింగరావు, రైతు సంఘం నాయకులు గొర్ల బాబూరావు, సూరకాసుల గోవింద్, తళ్లా భార్గవ్, గంటా తిరుపతిరావు, యలమంచిలి తాతబాబు తదితరులు కారిడార్ నిర్వాసిత రైతులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారిడార్ పరిధిలో నివాసాలు కోల్పోయేవారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, ఒక్కొక్కరికి రూ.25 లక్షలు పరిహారం, పది సెంట్లు స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకూ ఎటువంటి పనులు చేపట్టరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు తళ్లా అప్పలస్వామి, సూరిబాబు, రావి ఈశ్వరరావు, అప్పారావు, ఎరుపిల్లి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభం వద్ద ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్

సింహాచలం, ఆగస్టు 25: వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం అనంతపురం జిల్లాకు చెందిన శాసనసభ్యులు ఎ. సురేంద్రబాబు, ఇంటలిజెన్స్ బ్యూరో (సెంట్రల్) ప్రత్యేక డైరెక్టర్ చంద్రశేఖర్ ఆజాద్ (ఐపీఎస్), జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు పీవీ నరసింహం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి నక్క ఆనందకుమార్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండప ప్రదక్షిణ చేసి అంతరాలయంలోకి వెళ్లిన ప్రముఖుల గోత్రనామాలతో అర్చకులు స్వామివారికి అష్టోత్తర శతనామార్చన జరిపారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజల తరువాత పండితులు వేదాశీర్వచనాలిచ్చారు. ప్రహ్లాదవరదుడైన సింహాచల వరాహలక్ష్మీనారసింహునికి వైభవంగా పసడి కుసుమార్చన నిర్వహించారు. ఇందులోభాగంగా ఆదివారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవి సమేతం శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు.

అనంతపద్మనాభునికి లక్ష తులసీ పూజ



పద్మనాభం, ఆగస్టు 25: పద్మనాభంలోని అనంతపద్మనాభుని క్షేత్రంలో లక్ష తులసి దళ పూజా కార్యక్రమం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. ఏటా శ్రావణ మాసంలో నిర్వహించే ఈఉత్సవంలో భాగంగా ముందుగా అనంతుని ఉత్సవ విగ్రహాలు, కుంతీమాధవస్వామి మూలవిరాట్టులకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవానికి అవసరమైన తులసి దళాలను వేదమంత్రోచ్చరణలతో ఆలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేసి ఆలయంలోకి తీసుకువెళ్లారు. వేదపండితుల సహస్ర నామస్మరణతో స్వామివారిని లక్షతులసి దళార్చనను వైభవంగా పూర్తి చేశారు. అనంతరం లక్ష్మీదేవికి కుంకుమార్చన చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలతో ఇబ్బందులు

» ప్రమాదాలకు గురవుతున్న పరవాడ గ్రామస్థులు
» అధికారులు వెంటనే స్పందించాలని వేడుకోలు



పరవాడ ప్రధాన రహదారి గుండా వెళ్తున్న భారీ వాహనం

పరవాడ, ఆగస్టు 25: మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారి గుండా ఇటీవల కాలంలో భారీ వాహనాల రాకపోకలు అధికమైంది. ఈ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునగపాక మండలంలోని వెంకటాపురానికి సమీపంలో గల ఆర్‌హెచ్‌ఐ క్లాసిల్ కంపెనీకి కావాల్సిన ముడిసరకులు తరలించే భారీ వాహనాలన్నీ పరవాడ గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల తరుచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. రహదారికి ఆనుకుని నివాసాలు ఉండడంతో పాటు వృద్ధులు, చిన్నపిల్లలు రహదారి దాటేటప్పుడు ప్రమాదాలకు గురవుతున్నారు. కేవలం భారీ వాహనాల రాకపోకలు కారణంగానే తరుచూ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భారీ వాహనాలకు అనుమతులు లేనప్పటికీ నిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి పరవాడ ప్రధాన రహదారి గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేనిపక్షంలో వాహనాలు రాకుండా తాము అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే సంబంధిత కంపెనీ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చూడముచ్చటగా చిన్నికృష్ణుడు

» అంకుడు కర్రతో అద్భుతంగా చెక్కిన ఏటికొప్పాక మహిళ





అంకుడు కర్రతో లావణ్య చెక్కిన చిన్నికృష్ణుని బొమ్మ

ఎలమంచిలి, ఆగస్టు 25: హస్త కళా రంగంలో జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన హస్తకళాకారిణి చింతల లావణ్య అంకుడు కర్రతో సూక్ష్మ కళాఖండాన్ని రూపొందించారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని అంకుడు కర్రతో రెండు రోజుల పాటు శ్రమించి 3.5 సెం.మీ ఎత్తు, 2 సెం.మీ వెడల్పులో చిన్న బొమ్మను అత్యద్భుతంగా చెక్కారు. దీనిని చూసినవారంతా ఆమెలోని కళా నైపుణ్యాన్ని ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

డ్వాక్రా మహిళలకు అవార్డు



అవార్డు పొందిన రేవతిని సత్కరిస్తున్న డ్వాక్రా సంఘం ప్రతినిధులు

ఎలమంచిలి, ఆగస్టు 25: లక్ పతి దీదీ కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమాన్ని డ్వాక్రా సంఘాల మహిళలు పెద్ద ఎత్తున వీక్షించారు. మండల మహిళా సమాఖ్య అధికారుల ఆధ్వర్యంలో ఏటికొప్పాకలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకుల రుణాలను సద్వినియోగం చేసుకున్న ఇక్కడి శ్రీసూర్య గ్రామ సంఘంలోని వానపల్లి రేవతి, గొంతుమూర్తి సత్యవతిలు లక్ పతి దీదీలో ఆవార్డుకు ఎంపికైనట్టు మండల సమాఖ్య ప్రతినిధి రాణి తెలిపారు. ఏటికొప్పాక-5 మోడల్ వీవోగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇక్కడున్న 30 సంఘాలు అన్ని రకాలైన ప్రభుత్వ పథకాలు పొంది వాటి లక్ష్యాలకు అనుగుణంగా జీవనోపాధి పొందుతున్నారన్నారు. అనంతరం అవార్డుకు ఎంపికైన వారిని గ్రామమైక్య సంఘం ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రతినిధి రాణి, సీసీలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో శానిటేషన్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

» సంఘం జిల్లా కమిటీ సమావేశంలో కార్యదర్శి జానకి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జానకి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని స్కూల్ శానిటేషన్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి జానకి కోరారు. ఆదివారం ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మార్చి నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో ఆయా కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇచ్చేదే అరకొరని, అదికూడా సకాలంలో చెల్లించకపోతే కుటుంబాలను ఎలా నెట్టుకు వస్తారని ప్రశ్నించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ హైస్కూళ్లలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు అధిక పని ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎక్కువ ఉన్నా తక్కువ మంది సిబ్బందితో పనిచేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో కార్మికులకు సెలవులు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వీరి సమస్యలపై తక్షణమే స్పందించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు వరలక్ష్మి, నీలవేణి, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆగాకర పంటపై రైతుల ఆసక్తి



చినరాచపల్లిలో ఆగాకర కూరగాయల సాగు

మాకవరపాలెం, ఆగస్టు 25: మండలంలోని చినరాచపల్లి గ్రామ రైతులు ఆగాకర కూరగాయల పంటలపై ఆసక్తి చూపుతున్నారు. గ్రామానికి చెందిన భూములు అల్యూమినియం కర్మాగారం భూసేకరణలో పోయినప్పటికీ మిగిలిన భూముల్లో మాత్రం రైతులు కూరగాయల పంటలు వేసి సాగు చేస్తున్నారు. సుమారు 20 ఎకరాల్లో రైతులు ఆగాకర కూరగాయల సాగు చేపట్టారు. అయితే ఆగాకర కిలో రూ.120 ధర ఉండటంతో లాభదాయకంగా ఉందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సాగును చేపట్టి సోలార్ మోటార్ల ద్వారా నీటి తడులు అందించి లాభాల పంటగా సాగు చేస్తున్నారు. భవిష్యత్తులో ఈ సాగు మరింత పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.

‘పేట’లో అధ్వానంగా బీసీల రుద్రభూమి

» పిచ్చిమొక్కలతో చిట్టడవిలా తయారు » అడుగు పెట్టాలంటే భయం



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న శ్మశానవాటిక



పాయకరావుపేట, ఆగస్టు 25 : పట్టణంలో బీసీలకు కేటాయించిన హిందూ శ్మశానవాటికను పట్టించుకునే వారు కరువయ్యారు. పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవిలా కనిపిస్తోంది. దీంతో మృతదేహాను ఖననం చేసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 30వేల జనాభా ఉన్న పాయకరావుపేటలోని మంగవరం రోడ్డు శివారులో ఉన్న హిందూ శ్మశానవాటిక రెవెన్యూ, పంచాయతీ రికార్డుల ప్రకారం సుమారు ఆరు ఎకరాల్లో ఉండాలని పూర్వం పెద్దలు చెబుతున్నారు. అయితే దీనిని మొదటి నుంచి పట్టించుకున్నవారులేక చుట్టుపక్కల ఆక్రమణల పాలవడంతో పాటు కొంత స్థలాన్ని పంచాయతీ డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తుండడంతో ప్రస్తుతం సగానికి కుంచించుకుపోయింది. దీనిలో కాపు సామాజిక వర్గంతోపాటు ముస్లిం, క్రిస్టియన్‌లకు కేటాయించిన స్థలాలు పోను మిగిలిన స్థలాన్ని బీసీ వర్గాలకు కేటాయించారు. వీటిలో బీసీ వర్గాలు తప్పించి మిగిలిన మూడు వర్గాలకు చెందిన శ్మశానవాటికలను ఆయా వర్గాలు తమ సొంత ఖర్చుతో చుట్టూ రక్షణ ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చేసుకున్నారు. బీసీలకు కేటాయించిన శ్మశానవాటికను ఎవరూ పట్టించుకున్నవారు లేక పోవడంతో పిచ్చిమొక్కలు, చెత్త చెదారంతో దర్శనమిచ్చేది. ఈక్రమంలో గతేడాది అధికారులు, పలువురు రాజకీయ నాయకుల కృషి ఫలితంగా మండలంలో ఉన్న డక్కన్ కెమికల్స్ పరిశ్రమ యాజమాన్యం ఈశ్మశానవాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మించింది. అదేవిధంగా శ్మశానవాటిలో తుప్పలు కూడా తొలగించారు. ఆ తరువాత నుంచి పట్టించుకున్నవారు లేకపోవడంతో ప్రస్తుతం పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి చిట్టడవిని తలపిస్తోంది. లోపలికి వెళ్ళేందుకు ఏర్పాటుచేసి మార్గాల్లో కూడా తుప్పలు పెరిగిపోయి మృతదేహాలను తీసుకు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ మరుభూమిని అభివృద్ధి చేయాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

‘ఎసెన్షియా’లో పర్యటించిన జడ్జి

» ప్రమాద స్థలం పరిశీలన » మృతులు, క్షతగాత్రుల వివరాలు ఆరా



పరిశ్రమలో ఘటన వివరాలు తెలుసుకుంటున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

ఎలమంచిలి/ రాంబిల్లి, ఆగస్టు 25 : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో ఇటీవల చోటు చేసుకున్న ప్రమాద స్థలాన్ని ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ, పోలీసు ఉన్నతాధికారులు, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు, మృతులు, క్షతగాత్రుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఈ ప్రమాదంలో గాయపడి అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్న వారిని పరామర్శించారు. వీరికి అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కూలిందా.. ప్రాణాలు గోవిందా...

» వెంకటపతిపాలెంలో శిథిలమైన సామాజిక భవనం
» తొలగించకుంటే ప్రమాదం తప్పదని గ్రామస్థులు ఆందోళన



కూలేందుకు సిద్ధంగా ఉన్న సామాజిక భవనం

పరవాడ, ఆగస్టు 25 : మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి వెంకటపతిపాలెంలో గల సామాజిక భవనం ప్రమాదకరంగా మారింది. సుమారు నలభై ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. పిల్లర్లు దెబ్బతిని ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. గోడలు పూర్తిగా బీటలువారాయి. శ్లాబు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. ఇదిలావుంటే, సామాజిక భవనానికి సమీపంలోనే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఖాళీ సమయాల్లో పిల్లలంతా ఈ భవనం వద్దే ఆటలాడుతుంటారు. ఈ క్రమంలో ఏం ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. శిథిల భవనాన్ని తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో ఏం ప్రమాదం జరిగినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

గతంలో 60 గజాల స్థలానికి పట్టా ఇచ్చారని, అయినప్పటికీ ఆమె మరో 20 గజాలు ఆక్రమించి కాలువకు స్థలం ఇవ్వనని మొండికేశారన్నారు. ఆమె ఉంటున్న 60 గజాల స్థలం వరకూ తామేమీ ఇబ్బంది కలిగించబోమని, అదనంగా ఆక్రమించిన స్థలం వదిలేస్తే కాలువ నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. కాలువల నిర్మాణం కోసం ఆక్రమణల తొలగింపు వ్యవహారంలో నిబంధనల మేరకే వ్యవహరిస్తున్నామని చెప్పారు.

వేధిస్తున్న ఇసుక కొరత

... 5వ పేజీ తరువాయి

సిండికేట్‌గా ఏర్పడి రాజమహేంద్రవరం నుంచి లారీలు, టిప్పర్లతో ఇసుక తీసుకొచ్చి బలిఘట్టంలో డంప్ చేసి ట్రాక్టర్ ఇసుక రూ.8500లకు విక్రయిస్తున్నారు. రూ.6 వేలకు దొరికే ఇసుక ఒకేసారి రూ.8,500 కావడంతో గృహ నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొత్తగా ఇళ్లు కట్టుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. రెండు నెలలుగా మునిసిపాలిటీలో ఇంటి ప్లాన్ దరఖాస్తులు కూడా తగ్గిపోయాయి. నర్సీపట్నం ప్రాంతంలోని 5 వేల మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేసి ఇసుక, మెటల్ సమస్యను పరిష్కరించాలని ఆర్డీవో జయరాంకి వినతి పత్రం అందజేశారు.

కార్మికులు రోడ్డున పడ్డారు



ఇసుక, మెటల్ కొరత వల్ల ఇళ్ల నిర్మాణాలు మందగించాయి. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండాపోయాయి. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తున్నది. అధికారులు స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించాలి.

– కిల్లాడ రామకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, నర్సీపట్నం

చెత్త నిర్వహణలో మునిసి‘పల్టీ’

» పట్టణంలో పలు చోట్ల తిరగబడి దర్శనమిస్తున్న డంపర్, ట్విన్ బిన్‌లు » పట్టించుకోని అధికారులు » ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు





పట్టణంలోని ప్రధాన రోడ్డు పక్కన ఇలా తిరగేసి వృథాగా ఉన్న చెత్త డబ్బాలు.., చైర్‌పర్సన్ వార్డులోని బాలికల ఉన్నత పాఠశాల వద్ద..

ఎలమంచిలి, ఆగస్టు 25 : మునిసిపాలిటీలో చెత్త నిర్వహణ తీరు అధ్వానంగా మారింది. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తాచెదారాన్ని తీసుకు వెళ్లి వేసేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసి వీధుల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్‌లు, ట్విన్ బిన్‌లు ఎక్కడికక్కడ పలుచోట్ల తిరగేసి ఉండి కనిపిస్తున్నాయి. దీంతో చెత్త ఎక్కడ వేయాలో తెలియక పలువురు ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. ప్రధాన రోడ్డు పక్కన ఉన్న చెత్త డబ్బాలు సైతం ఇదే దుస్థితిలో దర్శనమిస్తుండడం ఆశ్చర్యకరం. ఇటువంటి దృశ్యాలు అధికారులు, మునిసిపల్ సిబ్బంది చూసినా పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీలో ప్రజారోగ్య పాలన ఎలా ఉందో చెప్పేందుకు ఇవే ఉదాహరణగా నిలుస్తున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. అసలే వర్షా కాలం, ఆపై సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న తరుణంగా ప్రజారోగ్యంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు మునిసిపాలిటీలో చెత్త సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాల్సిందిగా అంతా కోరుతున్నారు.



మెయిన్ రోడ్డు పక్కన ఆంజనేయ స్వామి ఆలయం వద్ద...

ఘనంగా షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం



షిర్డీసాయిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గంటా

కశింకోట, ఆగస్టు 25 : మండలంలోని సోమవరం గ్రామంలో షిర్డీసాయి ఆలయం పదకొండో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి సాయినాథునికి విశేష పూజలు, పంచామృతాభి షేకాలు నిర్వహించారు. అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు వీరిని సత్కరించారు. కాగా సాయంత్రం వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కూటమి నేతలు, కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వెంకన్న కల్యాణోత్సవ వేదికపై మాజీ ఎమ్మెల్సీ బుద్దను సత్కరిస్తున్న నిర్వాహకులు

గురుకులంలో మిగుల సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

సబ్బవరం, ఆగస్టు 25 : ఇక్కడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతిలో బాలుర ఎస్సీ కేటగిరిలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 27న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదివిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. ప్రవేశం పొందగోరు విద్యార్థులు ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలతో మంగళవారం హాజరు కావాల్సిందిగా కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 : గాంధీనగరం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో వారాధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి తొంబై మంది విద్యార్థినీ, విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. వ్యాసరచన విభాగంలో చీడికాడ మండలం మంచాల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వక్తృత్వ పోటీల్లో వి.మాడుగుల మండలం కింతలి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపడంతో ఈ రెండు పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధికారికి సత్కారం



ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

పాయకరావుపేట, ఆగస్టు 25 : గొలుగొండ పీహెచ్‌సీలో సీహెచ్‌వోగా పనిచేస్తూ ఇటీవల జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న బీజేవీ ప్రసాద్‌ను దళిత ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఇక్కడ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ దంపతులను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆర్.రమేష్‌బాబు, డి.నెహ్రూ, ఎస్.వరప్రసాద్, ఎ.జోషిపాల్, కె.ఆనంద్‌కుమార్, ఎన్.నూకరాజు, బి.వెంకట్రావు, టి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షనే మేలు

» యూటీఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి



సమావేశంలో మాట్లాడుతున్న చినబ్బాయి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. స్థానిక సీబీటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటైన యూనియన్ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ప్రవేశానికి ప్రకటన చేసిందన్నారు. ఈ పథకం ద్వారా 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 50 శాతం పెన్షన్‌తో పాటు గ్రాట్యుటీ, డీఆర్ కూడా ఇస్తామని చెప్పారన్నారు. అయితే గత రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీపీఎస్ పథకంలో 50శాతం పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చినప్పటికీ గ్రాట్యుటీ, డీఆర్‌లపై స్పష్టమైన హామీ ఇవ్వలేదన్నారు. అయితే ఉద్యోగులు మాత్రం పాత పెన్షన్ పథకంలో ఉన్న ప్రయోజనాలు మాత్రమే కోరుకుంటున్నారని వివరించారు. నూతన ప్రభుత్వం పాత పెన్షన్ పథకం ఆలోచన చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు శేషుబాబు, మాకిరెడ్డి రాజునాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



జగతా శ్రీనివాస్ తదితరులను సత్కరిస్తున్న కాపు నాయకులు

పాయకరావుపేట, ఆగస్టు 25 : కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడంతో పాటు రాజ్యాధికారం దిశగా పయనించాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఐక్యకాపునాడు వ్యవస్థాపక కన్వీనర్ పబ్బిసెట్టి శ్రీవెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పాయకరావుపేట విచ్చేసిన ఆయన కాపుల అభివృద్ధికి కృషిచేస్తున్న పట్టణానికి చెందిన కాపు నాయకులు జగతా శ్రీనివాస్ తదితరులను ఘనంగా సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయ పార్టీ గెలుపులో నిర్ణయాత్మక శక్తిగా కాపులు ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాపు సంఘాల కో-ఆర్డినేటర్ కేవీఆర్ నాయుడు, ధనిశెట్టి తిరమలేశ్వరరావు, వెలుగుల అర్జునరావు, పవన్, సాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో విద్యార్థులు శాంతి ర్యాలీ



పాయకరావుపేట, ఆగస్టు 25 : ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆదివారం రాత్రి విద్యార్థులు పాయకరావుపేటలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఆయన ఆత్మకుశాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, రవి, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏసుబాబుకు గిడుగు సాహిత్య సేవా పురస్కారం

కొత్తూరు, ఆగస్టు 25 : వ్యవహారిక భాషోద్యమానికి మూలపురుషుడు గిడుగు వెంకట రామమూర్తి స్మారక పురస్కారానికి ఆంధ్రప్రదేశ్ నుంచి లాలం ఏసుబాబు ఎంపికయ్యారు. సాయానికి 10రూపాయలు సేవా సంస్థను ఏర్పాటు చేసి విస్తృతంగా చేపడుతున్న సేవలకు ఈ గుర్తింపు లభించింది. ఈనెల 29న విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమంలో పురస్కారాన్ని అందుకోనున్నారు.

పెదకలవలాపల్లిలో ఐదో రోజుకు దేముళ్ళు ఆమరణ దీక్ష

» జీవనాధారమైన కొండపై నేవీ ప్రహరీ గోడ నిర్మించడంతో అన్నివిధాలా నష్టపోయామని ఆరోపణ
» ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడి వేడుకోలు



దేముళ్ళు దీక్షకు మద్దతు తెలుపుతున్న గ్రామస్థులు

రాంబిల్లి, ఆగస్టు 25 : మండలంలోని పెదకలవలాపల్లిని ఆనుకొని ఉన్న కొండ చుట్టూ నేవీ అధికారులు డీఆర్‌డీవో ద్వారా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడంతో నష్టపోయిన గ్రామస్థులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావి దేముళ్ళు చేపట్టిన అమరణ నిరాహార దీక్ష ఆదివారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల కాలంగా గ్రామస్థులం తమకు జీవనాధారమైన పశువులను ఈ కొండపై మేపుకుంటూ, పనులు చేసుకుంటూ గడిపేవామన్నారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న శారదా నది ఉప్పొంగితే ఈ కొండే ఆధారమని పేర్కొన్నారు. ఇటువంటి కొండ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడం వల్ల అన్నివిధాలా నష్టపోయామని వాపోయారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాల్సిందిగా కోరారు. ఈ ఆందోళనకు పలువురు సంఘీభావం తెలిపారు.

తాళ్లపాలెంలో గ్రామకంఠ స్థలం ఆక్రమణ!

» యథేచ్ఛగా సాగుతున్న నిర్మాణాలు » నోటీసులతో సరిపెట్టుకున్న పంచాయతీ అధికారులు



రామాలయం వద్ద గ్రామకంఠం స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

కశింకోట, ఆగస్టు 25 : మండలంలోని మేజర్ పంచాయతీ తాళ్లపాలెం రామాలయం వద్ద ఉన్న గ్రామకంఠం స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాళ్లపాలెం- నర్సీపట్నం రోడ్డును ఆనుకొని ఈ భూములు ఉండడంతో సెంటు ఎనిమిది లక్షల నుంచి పది లక్షలు రూపాయల వరకు ధర పలుకుతోంది. దీంతో యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్నారని అంటున్నారు. తాళ్లపాలెం గ్రామ పంచాయతీ సర్వే నంబరు 117-2లో సుమారు పది ఎకరాలు ఉండేది. కాలక్రమేణా అక్రమ నిర్మాణాలు పెరిగిపోయాయి. అయినప్పటికీ పంచాయతీ అధికారులు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల తాళ్లపాలెం రామాలయం వద్ద డ్రైనేజీలను అక్రమించి ఇల్లు నిర్మాణం చేపడుతుండగా పంచాయతీ అధికారులు ఆ పనులను ఆపివేయాలని ఆక్రమణదారులను హెచ్చరిస్తూ నోటీసులు జారీ చేశారు. అయినప్పటికీ బేఖాతరు చేస్తూ నిర్మాణాలను చేపట్టారని అంటున్నారు. తక్షణమే నిర్మాణాలను అడ్డుకొని గ్రామకంఠం స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఐ

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యారావును వివరణ కోరగా, ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరిస్తూ తాను నోటీసులు జారీ చేశానని చెప్పారు. అంతేగాకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆక్రమణపై ఎంపీడీవో ఎ.రవికుమార్‌ను వివరణ కోరగా, గ్రామకంఠం విషయం తమ దృష్టికి వచ్చిందని విచారణలో ఉందని బదులిచ్చారు.

తాగు నీరు వృథా.. ఎవరికీ పట్టని వ్యథ

» ఏపీఐఐసీకి చెందిన పైపులైన్‌కు మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ వద్ద రంధ్రం
» తొమ్మిది నెలలుగా ఇదే దుస్థితి ఉన్నా పట్టించుకోని అధికారులు



పైపులైన్‌కు రంధ్రం పడడంతో నీరు వృథా



ప్రధాన రహదారిపై పారుతున్న నీరు

పరవాడ, ఆగస్టు 25 : ఏపీఐఐసీకి చెందిన తాగునీటి పైపులైన్‌కు పరవాడ మండల పరిషత్ జంక్షన్ వద్ద రంధ్రం పడి నీరు వృథాగా పోతోంది. గత తొమ్మిది నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అచ్యుతాపురం సెజ్‌లో పరిశ్రమల తాగునీటి అవసరాల నిమిత్తం ఏలేరు కాలువ నుంచి పరవాడ మీదుగా అచ్యుతాపురం వరకు ఏపీఐఐసీ అధికారులు సుమారు పదేళ్ల క్రితం తాగునీటి పైపలైన్ ఏర్పాటు చేశారు. అయితే తొమ్మిది నెలల క్రితం మండల పరిషత్ కార్యాలయం జంక్షన్ వద్ద పైపులైన్‌కు రంధ్రం ఏర్పడింది. దీని కారణంగా నీరు వృథాగా పోతోంది. ఆ ప్రాంతమంతా చెరువును తలపిస్తుంది. సమీపంలోని రోడ్డు పై నుంచి పారుతూ గెడ్డల్లోకి చేరుతోంది. ప్రధాన రహదారికి ఆనుకుని ఈ సమస్య ఉన్నా అధికారులెవ్వరూ పట్టించుకోలేదు. తాగునీటి వృథాపై స్థానికులు మండిపడుతున్నారు. నెలలు తరబడి నీరు వృథాగా పోతున్నా ఏపీఐఐసీ అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే ఈ సమస్యపై స్పందించాల్సిందిగా పరవాడ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

బిందేశ్వరి ప్రసాద్ మండల్‌కు నివాళి



మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 25 : బిహార్ దివంగత ముఖ్యమంత్రి, రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు చైర్మన్‌గా పనిచేశారని బాబు బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతిని ఆదివారం ఇక్కడ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఆయన చిత్రపటానికి సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి బొట్టా చిన్నియాదవ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర కార్యదర్శి బద్దం పైడిరాజు, చిన్నమూర్తి, పల్లా గోవింద, కృష్ణారావు, చిరంజీవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండుగ



ఘటాలతో ఆలయానికి వెళుతున్న ఎమ్మెల్యే బండారు, భక్తులు

చీడికాడ, ఆగస్టు 25 : మండల కేంద్రంలో ఆదివారం మోదమాంబ పండగను ఘనంగా నిర్వహించారు. మంచాల రోడ్డుకు ఇరువైపులా ఉన్న కల్లాలు గల కుటుంబీకులు ఇలవేల్పు అయిన మోదమాంబకు వేకువజాము నుంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం ఘటాలతో ఊరేగింపుగా వెళ్లారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి, నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు, టీడీపీ నాయకులు గండి ముసలినాయుడు, పోతల రమణమ్మ తదితరులు అమ్మవారి ఘటాలను నెత్తిపై పెట్టుకొని రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న మోదమాంబ దేవాలయానికి భక్తులతో కలిసి వెళ్లారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యర్రా అప్పారావుతో పాటు ఆయా కుటుంబాల పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మోదకొండమ్మకు పూజలు



అలంకరణలో మోదకొండమ్మ (ఇన్‌సెట్) భక్తులతో నిండిన ఆలయ ప్రాంగణం

మాడుగుల, ఆగస్టు 25 : స్థానిక మోదకొండమ్మ అమ్మ వారి ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అలంకరించి ఉదయం ఆరు గంటల నుంచి కుంకుమ పూజలు, అభిషేకాలను నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారి ఘటాల పండును నిర్వహించుకొని నెత్తిన ఘటాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకొని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పని చేసే ప్రతి ఒక్కరికి గుర్తింపు

- మాడుగుల ఎమ్మెల్యే బంగారు సత్యనారాయణమూర్తి



కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, ఆగస్టు 25 : పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం మాడుగుల వచ్చిన ఆయన పంచాయతీ రాజ్ అతిథిగృహంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన ఏడుగురు కార్యకర్తలకు ఎమ్మెల్యేబండారు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం పార్టీ సిద్ధాంతాలకు ప్రతీ ఒక్కరూ అవగాహన చేసుకొని పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ పైలా ప్రసాదరావు, మండల నాయకులు జగ్గారావు, దేముడు, సన్యాసిరావు, పుప్పాల రమేష్, కార్యకర్తలుపాల్గొన్నారు.

ఆనాటి ఆ స్నేహమానంద గీతం

- 1998-99 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమావేశం
- మధుర స్మృతులను గుర్తుచేసుకున్న పూర్వ విద్యార్థులు



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

రోలుగుంట, ఆగస్టు 25 : స్థానిక జడ్పీ పాఠశాలలో 1998-99లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వారంతా ఒక చోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగక్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. 25 ఏళ్ల నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఇప్పుడు ఎవరు ఏం చేస్తున్నారంటూ ఆసక్తి ఆరా తీశారు. కుటుంబ వివరాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, మణి, దొరబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలి

- వైస్ ఎంపీపీ స్వాతి



విద్యా కమిటీ ఛైర్మన్లు, సభ్యులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

చీడికాడ, ఆగస్టు 25 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అంతా అంకితభావంతో పని చేయాలని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ధర్మిశెట్టి స్వాతి, వరహాపురం సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు కోరారు. ఈనెల 17న జరిగిన వరహాపురం ఎలిమెంటరీ, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యాకమిటీ ఎన్నికల్లో గెలుపొందిన ఛైర్మన్లు మిస్కా అప్పారావు యాదవ్, పోతుబంతి దుర్గారావుతో పాటు పలువురు కమిటీ సభ్యులను వైస్ ఎంపీపీ, సర్పంచ్‌ల చేతుల మీదుగా ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ నెలకు కనీసం రెండుసార్లు పాఠశాలలను తనిఖీ చేసి అక్కడి సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొల్లవిల్లి రాజబాబు, ధర్మిశెట్టి అప్పలనాయుడు, కొండబాబు, అచ్చిబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మిథ్యగా కంప్యూటర్ విద్య

- వైసీపీ ప్రభుత్వ హయాంలో కరెంటు బిల్లు చెల్లించని ఫలితం
- విద్యుత్ కనెక్షన్ తొలగింపు
- మూడేళ్లుగా కంటైయినర్‌లో అలంకారప్రాయంగా కంప్యూటర్



కంప్యూటర్లు ఏర్పాటు చేసిన కంటైనర్



కంప్యూటర్ స్టడీస్‌లో విద్యార్థులు (ఫైల్)

కృష్ణాదేవి పేట, ఆగస్టు 25 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం హైస్కూల్‌లో ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఏసీ కంప్యూటర్‌కంటైనర్ నిరుపయోగంగా తయారైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల పాటు విద్యుత్ బిల్లు మొత్తం సుమారు రూ.లక్షకు పైగా చెల్లించలేదు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు మూడేళ్ల కిందట కనెక్షన్ తొలగించారు. దీంతో ఈ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 920 మంది విద్యార్థులు కంప్యూటర్ విద్యకు నోచుకోవడం లేదు.

2017-18లో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న చింతకాయల అయ్యన్నపాత్రుడు విద్యార్థులకు కంప్యూటర్ విద్య అవసరమని గుర్తించి రూ.30 లక్షలతో అన్ని సదుపాయాలతో కూడిన 16 కంప్యూటర్లు కలిగిన కంటైనర్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కంప్యూటర్ విద్య ఇక్కడ అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ చదువుతో పాటు కంప్యూటర్ విద్య నేర్చుకునే అవకాశం ఉండడంతో విద్యార్థులు పోటీ ప్రపంచంలోరాణించే అవకాశం ఉండేది. కానీ మూడేళ్ల కిందట నుంచి కేవలం విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో కంప్యూటర్ విద్య అందని పరిస్థితి ఎదురైంది. ప్రస్తుతం కంటైనర్, అందులో ఉన్న 16 కంప్యూటర్లు పని చేసే స్థితిలోనే ఉన్నాయి. విద్యుత్ పునరుద్ధరణ జరిగితే మళ్లీ విద్యార్థులకు కంప్యూటర్ విద్య అందే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

స్పీకర్ అయ్యన్న స్పందించాలి

ఈ విషయమై పలుమార్లు స్కూలు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు.. అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. దీని గురించి ఏ ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలోనైనా ఈ కంటైనర్‌లో కంప్యూటర్ విద్య పునరుద్ధరణపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

ముఖ్యంగా.. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ స్పీకర్‌గా వ్యవహరిస్తున్న అయ్యన్నపాత్రుడు ఈ సమస్య గురించి పట్టించుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా జన్మాష్టమి వేడుకలు

- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- ముగ్గుల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం



ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న భాస్కరరావు తదితరులు

దేవరాపల్లి, ఆగస్టు 25 : కృష్ణాష్టమి వేడుకల నేపథ్యంలో ఆదివారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం నాయకులు, యువకులు ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 30 మంది మహిళలు పాల్గొన్నారు. కృష్ణాలయం వద్ద రోడ్లు అంతా ముగ్గులతో నిండిపోయాయి. ప్రథమ బహుమతి ఇమ్మంది అనూష, రెండో బహుమతి గనివాడ మహాలక్ష్మి, మూడో బహుమతి బొబ్బర. రమాదేవి, నాలుగో బహుమతి గోకాడ దేవి విజేతలుగా నిలిచారు. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ఎల్.సత్యనారాయణ వ్యవహరించారు. మరి కొందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొల్లి కృష్ణమూర్తి, గొర్లె సన్యాసినాయుడు, గుల్లిపల్లి మురళి, బందం అప్పలరాజు, దేముళ్లు తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



వేడుకలకు అలంకరించిన గుల్లేపల్లి శ్రీకృష్ణ దేవాలయం

శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆలయాలు సిద్ధం

కె.కోటపాడు, ఆగస్టు 25 : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా పిండ్రంగి, ఆర్‌పై అగ్రహారం, గుల్లేపల్లి, గరుగుబిల్లి, గొండుపాలెం తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ ఆలయాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. పలు కృష్ణ ఆలయాల్లో అన్నదానం కూడా నిర్వహించేందుకు ఆయా యాదవ కమిటీలు నిర్ణయించారు.

దమ్ము ట్రాక్టర్ల దెబ్బకు రోడ్లపై గుంతలు



దమ్ము సెట్‌లతో రోడ్డుపై వెళుతున్న ట్రాక్టర్

నాతవరం, ఆగస్టు 25 : దమ్ము సెట్‌లతో ఉన్న ట్రాక్టర్లను రోడ్లపై తిరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. టైర్లకు దమ్ము సెట్ బిగించిన ట్రాక్టర్లు తిరుగుతుండడంతో రోడ్లు పెచ్చులు ఊడిపోతున్నాయని అంటున్నారు. దీంతో రహదారులు అధ్వానంగా తయారై సాధారణ వాహనాలు తిరిగేందుకు ఇబ్బందులు కలుగుతోందని చెబుతున్నారు. చాలా చోట్ల రహదారులు అధ్వానంగా ఉండడం, అసలే వర్షాకాలం కావడంతో ఇబ్బందిగా ఉందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దమ్ము సెట్‌లతో ట్రాక్టర్లు తిరుగుతుండడంతో రోడ్లు పాడవుతున్నాయని, ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యల శ్మశానం

- దట్టంగా పెరిగిన తుప్పలు
- పొదల మధ్యే బోరువెల్
- రహదారి సౌకర్యం లేదు



తుప్పలు పెరగడంతో అడవిని తలపిస్తున్న శ్మశానం ఇదే



తుప్పల్లో ఉన్న బోరు వెల్

కె.కోటపాడు, ఆగస్టు 25 : మండల కేంద్రంలోని దిగువ యాతపేటకు సమీపంలో గల శ్మశానంలో దట్టంగా తుప్పలు పెరిగిపోయాయి. అలాగే శ్మశానానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేదు. ఇక్కడ గ్రామంలోని వెలమ, రజక , యాత, యాదవ కులస్థులు మృతి చెందితే వారికి అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. అయితే శ్మశానంలో దట్టంగా తుప్పలు పెరిగిపోవడం, సరైన రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దహన సంస్కారాలు చేసేందుకు ఈ శ్మశానానికి వెళ్లడం అంటే భయంగా ఉంటోందని అంటున్నారు. చుట్టూ పొలాలు ఉండడంతో కొందరు శ్మశాన స్థలాన్ని కూడా ఆక్రమించారని ఆరోపిస్తున్నారు. శ్మశానంలో ఉన్న బోరువెల్ కూడా పిచ్చి మొక్కల మధ్య ఉందని, దీంతో అది నిరుపయోగంగా మారిందని అంటున్నారు. ఈ సమస్యపై పలుమా ర్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు సమర్పించినా ఎవరూ పట్టించుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి శ్మశానంలో కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

ఎంపీడీవో కార్యాలయం వద్ద కంపుకంపు



ఎంపీడీవో కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

చీడికాడ, ఆగస్టు 25 : చీడికాడ మండల పరిషత్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న గేటు పక్కనే చెత్తా చెదారం పడి ఉన్నా కార్యాలయ అధికారులు, సిబ్బంది కనీసం స్పందించడం లేదు. ప్రతిరోజు కార్యాలయానికి ఉదయం 10 గంటలకు ఎంపీడీవో, ఈవోపీఆర్డీతో పాటు, సూపరింటెండెంట్, ఇతర సిబ్బంది వచ్చి వెళుతుంటారు. వివిధ పనుల నిమిత్తం గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు అక్కడే ఉన్న బల్లపై కూర్చుని వేచి చూస్తుంటారు. అయితే సమీపంలోనే చెత్తాచెదారం ఉండడంతో దుర్వాసన వెలువడుతోందని వీరంతా అంటున్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్దే ఇలా అపరిశుభ్రత నెలకొంటే ఇది దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నారు. ఇక మండలంలో సమస్యలపై ఏ రీతిన వీరు స్పందన ఉంటుందో ఇట్టే అర్థమవుతోందని వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా ఎంపీడీవో కార్యాలయం వద్ద పరిశుభ్రత నెలకొనేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా చెత్తబుట్టలు

మాకవరపాలెం, ఆగస్టు 25 : మండలంలో పంచాయతీలకు అందజేయాల్సి చెత్తబుట్టలు మండల పరిషత్ కార్యాలయంలో వృథాగా పడి ఉన్నాయి. గత ఏడాది 2,400 చెత్త బుట్టలు మండల పరిషత్ కార్యాలయానికి వచ్చాయి. అయితే గ్రామాల్లో తడి, పొడి చెత్తను పోగు చేసేందుకు ఇంటింటికి ఇవ్వవలసి చెత్త బుట్టలు నెలలు తరబడి కార్యాలయానికి పరిమితం కావడంతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య మరీ అధ్వానంగా తయారైంది. గతంలో టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలు చేపట్టింది. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆవి పూర్తిగా నిర్వీర్యంగా మారడంతో సంపద కేంద్రాలు నిరుపయో గంగా మారాయి. మరోవైపు.. ఇంటింటికి అందజేయాల్సిన చెత్త బుట్టలు మండల పరిషత్ కార్యాలయంలో పడి ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త బుట్టలను పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో ఓ మూలన పడి ఉన్న డస్ట్‌బిన్లు

తటాకమే కదా.. తగ్గేదెలే!

- వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్న బీఎన్ రోడ్డు
- జలకాలాడుతున్న గేదెలు
- వాహన రాకపోకలకు ఇబ్బందులు





చెరువులోనో.. వాగుల్లోనో నీరు పుష్కలంగా ఉన్న చోట పశువులు నీటిలో దిగి సేద తీరుతుంటాయి. భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డులో రావికమతం-గర్నికం రోడ్డు మధ్యలో ఉన్న భారీ గోతుల్లో శనివారం కురిసిన వర్షానికి నీరు చేరింది. దీంతో ఈ రోడ్డు చెరువును తలపించేలా తయారైంది. ఆదివారం ఎండగా ఉండడంతో నీరు నిండిన ఆ గోతుల్లో గేదెలు చేరి జలాకాలాడుతూ కనిపించాయి. వాటికి అవి చెరువుల్లా కనిపించాయి మరి.

ఓ పక్క వాహనాల రాకపోకలు.. మరో పక్క రోడ్డుపై గుంతలో చేరిన వర్షపు నీటిలో గేదెలు మునుగుతూ సేదతీరడం చూసిన రోడ్డున పోయేవారు 'ఇదీ మన రోడ్ల (ప్ర)గతి' అంటూ వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ మార్గంలో ఎప్పుడు మరమ్మతులు చేపడతారోనంటూ గొణుక్కున్నారు.

\- రావికమతం

సంక్షిప్తంగా..

నేడు జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పోటీలు



చీడికాడ, ఆగస్టు 25 : మండలంలోని చుక్కపల్లి గ్రామంలో ఈనెల 26న జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు నిర్వహించనున్నట్టు ఆ గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం విలేకరులకు తెలిపారు. సోమవారం ఉదయం నుంచి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పూజలతో ప్రారంభమై మధ్యాహ్నం భారీస్థాయిలో అన్నసమారాధన జరుగుతుందన్నారు. సాయంత్రం 4 గంటలకు జిల్లా స్థాయి ఎడ్లబండ్ల పరుగు, అనంతరం తప్పెడుగుళ్లు పోటీలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

దివ్యాంగులకు సరకుల వితరణ

మాకవరపాలెం, ఆగస్టు 25 : మండలంలోని 20 మంది దివ్యాంగులకు మండల కేంద్రంలో దివ్యాంగుల పునారావాస భవనం వద్ద ఒక నెల సరిపడా నిత్యావసర సరుకులను నిమ్మల రమణ దంపతులు అందజేశారు. మండలంలో నగరం గ్రామానికి చెందిన నిమ్మల రమణ దంపతులు తన కుమారుడు జ్ఞాపకార్థంగా ఏటా దివ్యాంగులకు చేయూత అందిస్తూ ఉంటారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంస్థ అధ్యక్షుడు సతీష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సీపీఎం

దేవరాపల్లి, ఆగస్టు 25 : జిల్లాలోని వ్యవసాయ పంపుసెట్లు, నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే రైతులు, ప్రజలు ప్రతిఘటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు డి.వెంకన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నివాసాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు, వ్యవసాయ పంపుసెట్లు మీటర్లు అమర్చాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. స్మార్ట్‌మీటర్ల కాంట్రాక్టులో వైసీపీ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందంటూ ప్రతిపక్షంలో ఉండగా టీడీపీ వ్యతిరేకించిందని, ఇప్పుడు మళ్లీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఎలా పూనుకుంటుందన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే ప్రతిఘటిస్తామన్నారు.

జర్నలిస్టులది కీలక పాత్ర : సీఐ హరి

గొలుగొండ, ఆగస్టు 25 : సమాజాభివృద్ధిలో జర్నలిస్టులది కీలక పాత్ర అని నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి అన్నారు. ఆదివారం మండలపరిషత్ సమావేశ మందిరంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నర్సీపట్నం ప్రెస్‌క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. సమాజంలో జర్నలిస్టులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణారావు,ఏపీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు, విశాఖ జిల్లా ఫెడరేష న్ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వెంటేష్, నర్సీపట్నం ప్రెస్‌క్లబ్ కార్యదర్శి రాజు, పి.మల్లేశ్వరరావు, బాబు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చరూ..

కె.కోటపాడు, ఆగస్టు 25 : మండల కేంద్రం నుంచి చౌడువాడ వరకు ఆర్ అండ్ బీ రోడ్డుపై ఉన్న ప్రమాదకర గుంతలను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు. గతంలో పలుచోట్ల గుంతలను పూడ్చినప్పటికీ ప్రమాదకర గుంతలను కొన్నింటిని నేటికీ పూడ్చలేదు. దీంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాల సమయంలో ఈ గుంతల్లో నీరు చేరి మరింత ప్రమాదకరంగా తయారవుతున్నాయి. గొండుపాలెం, గుల్లేపల్లి గ్రామాల మధ్యలో గుంతలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు

వేధిస్తున్న ఇసుక కొరత

... 5వ పేజీ తరువాయి

సిండికేట్‌గా ఏర్పడి రాజమహేంద్రవరం నుంచి లారీలు, టిప్పర్లతో ఇసుక తీసుకొచ్చి బలిఘట్టంలో డంప్ చేసి ట్రాక్టర్ ఇసుక రూ.8500లకు విక్రయిస్తున్నారు. రూ.6 వేలకు దొరికే ఇసుక ఒకేసారి రూ.8,500 కావడంతో గృహ నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొత్తగా ఇళ్లు కట్టుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. రెండు నెలలుగా మునిసిపాలిటీలో ఇంటి ప్లాన్ దరఖాస్తులు కూడా తగ్గిపోయాయి. నర్సీపట్నం ప్రాంతంలోని 5 వేల మంది భవన నిర్మాణ కార్మికులు పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా చేసి ఇసుక, మెటల్ సమస్యను పరిష్కరించాలని ఆర్డీవో జయరాంకి వినతి పత్రం అందజేశారు.

కార్మికులు రోడ్డున పడ్డారు



ఇసుక, మెటల్ కొరత వల్ల ఇళ్ల నిర్మాణాలు మందగించాయి. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండాపోయాయి. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తున్నది. అధికారులు స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించాలి.

\- కిల్లాడ రామకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, నర్సీపట్నం

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

గతంలో 60 గజాల స్థలానికి పట్టా ఇచ్చారని, అయినప్పటికీ ఆమె మరో 20 గజాలు ఆక్రమించి కాలువకు స్థలం ఇవ్వనని మొండికేశారన్నారు. ఆమె ఉంటున్న 60 గజాల స్థలం వరకూ తామేమీ ఇబ్బంది కలిగించబోమని, అదనంగా ఆక్రమించిన స్థలం వదిలేస్తే కాలువ నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. కాలువల నిర్మాణం కోసం ఆక్రమణల తొలగింపు వ్యవహా రంలో నిబంధనల మేరకే వ్యవహరిస్తున్నామని చెప్పారు.